# భారత శక్తి ®
తెలుగు దినపత్రిక

సంపుటి: 20 సంచిక:46 | హైదరాబాద్, గురువారం, 31 జూలై 2025 | పేజీలు: 12 | వెల: 1.00

## ట్రంప్‌వి అబద్ధాలని మోదీ చెప్పలేకపోతున్నారు: రాహుల్

దిల్లీ: భారత్–పాకిస్థాన్ పోరు విరమణ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నవి అబద్ధాలని ప్రధాని మోదీ చెప్పలేకపోతున్నారని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శించారు. దీనివెనుక ఏదో రహస్యం దాగి ఉందని.. కప్పిపుచ్చేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. "ట్రంప్ మాటలు అబద్ధాలని మోదీ చెబితే అసలు నిజాలు బయటకొస్తాయి. అందుకే ఏం మాట్లాడలేకపోతున్నారని స్పష్టమవుతోంది" అని బుధవారం లోక్‌సభలో చెప్పారు. భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు తానే కారణమయ్యానని ట్రంప్ పదేపదే చెప్పడంపై విపక్షాలు మరోసారి మండిపడ్డాయి.

## నేటి భారతం...

మన జీవితంలో ఎదురయ్యే అడ్డంకులు
ఎంత తీవ్రమైనవి అయినా,
ఆగకుండా ముందుకు సాగడమే సాహసం.
మన గమ్యం కనబడకపోయినా,
గమ్యం పట్ల నమ్మకం వదలకుండా
నిరంతరం ప్రయాణం చేయాలి.
ప్రతి అడుగు మన ఆశయాన్ని దగ్గర చేస్తుంది.
ఆత్మవిశ్వాసం కలిగి ఉన్నప్పుడు,
ఎదురు పడే ప్రతి సమస్యను జయించడం
సాధ్యం అవుతుంది.
అడుగులు చిన్నవైనా సరే,
ఆగకుండా కొనసాగాలి

కేసారం. పెంటారెడ్డి




# నడిచే దేవుళ్ళు డాక్టర్లు..

## ( దైవత్వాన్ని మరచి రాక్షసులుగా మారిపోతున్న దౌర్భాగ్యం. )

- ఆసుపత్రులపై నమ్మకాన్ని కోల్పోతున్న జనాలు.
- డబ్బుకోసం పీడించడం తప్ప ప్రయోజనం ఉండటం లేదు.
- గవర్నమెంట్ ఆసుపత్రులను గాలికొదిలేస్తున్న దుర్మార్గం.
- ఉచిత వైద్యం అందించాల్సిన పరిస్థితులు మృగ్యం.
- పాడుబడిన స్థితికి చేరుకుంటున్న సర్కార్ దవాఖానాలు.
- ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఒరగబెడుతున్నది ఏమీ లేదు.
- తమ బాధ్యతలు మరచి మానవత్వానికి మచ్చ తెస్తున్న కొందరు వైద్యులు.
- సామాన్యుల రక్తం పీలుస్తున్న కార్పొరేట్ వైద్యశాలలు.
- కార్పొరేట్ ఆసుపత్రులకు దాసోహం అంటున్న ప్రభుత్వాలు.
- ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ అందిస్తున్న ప్రత్యేక కథనం.

" వైద్యో నారాయణో హరి " అన్నారు.. అంటే వైద్యుడు సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయుడితో సమానం అని అర్థం.. కానీ సోకాల్డ్ డాక్టర్లు కొందరు సరైన వైద్యం చేయకుండా రోగుల ప్రాణాలను హరీమని పిస్తున్నారు. భగవంతుడు ప్రాణం పోస్తే.. వైద్యుడు ఆ ప్రాణాలను నిలబెడతాడు.ఈ నమ్మకం ప్రతి ఒక్కరిలో ఉంటుంది.సరైన సమయానికి ఆసుపత్రికి వెళ్తే ఎలాంటి ఆరోగ్య ప్రమాదాన్నైనా తప్పించుకోవచ్చు ఆయన ఆశ ఉంటుంది.కానీ ఇప్పుడు పరిస్థితులు ఇందుకు భిన్నంగా గోచరిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యాలను, ప్రాణాలను లెక్కజేయకుండా కేవలం డబ్బు సంపాదన కోసమే కొందరు వైద్యులు పనిచేస్తున్నారు. ఇక ఇలాంటి కోవలోకి చేరే పలు ఆసుపత్రులు ఇప్పుడు కోకొల్లలుగా పుట్టుకు వస్తున్నాయి. తమ ఆరోగ్యాన్ని కుదుటపరుచుకోవాలని భావించి ఆసుపత్రులకు వస్తున్న రోగులను పీల్చి పిప్పి చేస్తున్నాయి.. దీనికి తోడు సాక్షాత్తూ పాలక ప్రభుత్వాలే కార్పొరేట్ ఆసుపత్రులకు ఊడిగం చేస్తున్నాయి. కారణం ఏమిటంటే దాదాపు కార్పొరేట్ ఆసుపత్రులు అధికార, రాజకీయ నాయకుల బంధువర్గానివో, స్నేహితులవో, బాగా కావాల్సిన వారివో అయి ఉండటం గమనార్హం.

12లో

# కొత్తగా మరో డిస్కం..

హైదరాబాద్, జులై 30 ( భారత శక్తి ) :



రాష్ట్రంలో కొత్తగా మరో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర విద్యుత్ విభాగం ప్రక్షాళనకు అవసరమైన సంస్కరణలు అమలు చేయాలని సూచించారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఇంధనశాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా ఇందులో పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న ఉత్తర, దక్షిణ డిస్కంలు వాణిజ్య కార్యకలాపాలు చేపడతాయని, కొత్త డిస్కం కేవలం ప్రభుత్వం సబ్సిడీపై అందించే విద్యుత్ పథకాలను నిర్వహించేలా పని విభజన చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వ్యవసాయంతో పాటు ఇళ్లు, పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాలన్నీ కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రమంతా ఒకే యూనిట్‌గా దీని పరిధి ఉండాలన్నారు. పాత డిస్కంల పనితీరు మెరుగుపడితే జాతీయస్థాయిలో రేటింగ్ పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.
ఇప్పుడున్న రెండు డిస్కంల ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు సంస్కరణలు తప్పనిసరని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాటి పునర్వ్యవస్థీకరణతో పాటు రుణ భారం తగ్గించాలని చెప్పారు. గతంలో 10 శాతం వడ్డీకి తీసుకున్న రుణాలతో డిస్కంలు డీలాపడ్డాయని, తక్కువ వడ్డీకి కొత్త రుణాలు తీసుకుని పాతవాటిని తీర్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర

12లో




## కాళేశ్వరంపై నేడు జస్టిస్ ఘోష్ నివేదిక

నీటిపారుదలశాఖ కార్యదర్శికి అందజేత
15 నెలలపాటు లోతుగా విచారించిన కమిషన్

, హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీలపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ గురువారం ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు. ప్రభుత్వ, రాజకీయ, అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన, ఆసక్తి రేకెత్తించిన కాళేశ్వరం కమిషన్ తుది నివేదికను గురువారం ఉదయం బీఆర్‌కే భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శికి సీల్డు కవర్‌లో అందజేయనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. కమిషన్ గడువు గురువారంతో ముగియనుండటంతో జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను అందజేసి శుక్రవారం కోల్‌కతాకు వెళ్లనున్నారు. సుమారు 15 నెలలపాటు లోతుగా విచారించిన కమిషన్ నివేదికలో ఏముండబోతోంది, ఎవరిని బాధ్యులుగా చేయ–ంబోతోంది, బ్యారేజీలలో లోపాలకు కారకులుగా ఎవరెవర్ని పేర్కొనబోతోంది తదితర

## మీ ప్రవర్తన విశ్వాసం కలిగించటం లేదు



దిల్లీ: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనపై అంతర్గత విచారణ కమిటీ నివేదికను సవాల్ చేసిన పిటిషన్‌పై బుధవారం సుప్రీంకోర్టు పదునైన ప్రశ్నలు సంధించింది. జస్టిస్ వర్మ ప్రవర్తన విశ్వాసాన్ని కలిగించటం లేదని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎ.జి.మసీహ్ ధర్మాసనం పేర్కొంది. తీర్పును రిజర్వు చేసింది. అంతర్గత విచారణ కమిటీని ఏర్పాటు చేసినప్పుడే సవాల్ చేయకుండా దాని ముందు ఎందుకు హాజరయ్యారని జస్టిస్ వర్మను ధర్మాసనం ప్రశ్నించింది. "కమిటీ నివేదిక ఇవ్వకముందే సుప్రీంకోర్టుకు వచ్చి ఉండాల్సింది. న్యాయమూర్తి తొలగింపు అంశాన్ని పార్లమెంటు పరిశీలిస్తుంది. ఆ డబ్బు మీదా, కాదా అన్నది పార్లమెంటు నిర్ణయిస్తుంది. అది అంతర్గత విచారణ కమిటీ బాధ్యత కాదు" అని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ తరఫు న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ.. జస్టిస్ వర్మ తొలగింపునకు విచారణ కమిటీ చేసిన సిఫార్సు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. అదే విషయమై ప్రధాన న్యాయమూర్తి చేసిన సిఫార్సు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని సిబల్ కోరారు. తన నివాసంలో లభించిన కాలిపోయి–ంన నోట్ల కట్టల వీడియోను సుప్రీంకోర్టు వెబ్‌సైట్లో పెట్టిఉండకూడదనే జస్టిస్ యశ్వంత్ వర్మ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది.




### గొర్రెల కుంభకోణంలో రంగంలోకి ఈడీ
### %రూ.700 కోట్ల మళ్లింపుపై ఆరా
### గ్రేటర్ హైదరాబాద్‌లో 8 చోట్ల ఏకకాలంలో సోదాలు
### తలసాని మాజీ ఓఎస్డీ కల్యాణ్‌కుమార్ విచారణ

హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం సోదాలు నిర్వహించింది. పశుసంవర్ధకశాఖ మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్‌క

### అందుకే బీజింగ్ ఒలింపిక్స్‌కు వెళ్లారు
### రాహుల్‌గాంధీపై జైశంకర్ పరోక్ష విమర్శలు
### ముగ్గురు ఉగ్రవాదుల తలలు లేపేశాం: అమిత్‌షా
### రాజ్యసభలో కొనసాగిన చర్చ.. చివర్లో విపక్షం వాకౌట్




దిల్లీ: లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ 'చైనా గురు' అని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ వ్యంగ్యంగా సంబోధించారు. రాహుల్ పేరు ప్రస్తావించకుండానే తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌పై బుధవారం రాజ్యసభలో కొనసాగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. "నేను చైనా గురు కాను. అందుకే ఇటీవలి నా పర్యటనలో అక్కడ ఎవరితోనూ రహస్యంగా సమావేశం కాలేదు.. గోప్యంగా ఒప్పందాలూ కుదుర్చుకోలేదు. ఉగ్రవాదం, ఉద్రిక్తతలు, వాణిజ్యం, ఉభయదేశాలకు ఆసక్తి ఉండే ఇతర అంశాలపైనే చర్చించాను. మనదగ్గర ఒక చైనా గురు ఉన్నారు. ఆయనకు ఆ దేశంపై ఎంతో ప్రేమ. ఇరు దేశాలకు సంబంధించి ఆయనొక ఒప్పందం కుదుర్చుకున్నారు. దానిపేరు చిండియా (చైనాంఇండియా). నా చైనా పర్యటనలో కొన్ని లోటుపాట్లు ఉండవచ్చు. ఎందుకంటే నేను చైనా (బీజింగ్) ఒలింపిక్స్‌కు వెళ్లి ఎవరిచేతా పాఠాలు చెప్పించుకోలేదు. నన్నెవరూ దానికి పిలవలేదు. ఎందుకంటే నేను ప్రత్యేక వ్యక్తిని కాను. ఒకరు మాత్రం ఆ ఒలింపిక్స్‌కు వెళ్లి జ్ఞానం పొందారు. వారు అక్కడ చైనావాళ్లనే కాదు.. వేరేవారినీ కలిశారు. ఒలింపిక్స్ క్లాస్‌రూంలో నిద్రపోవడం వల్ల ఆయన నేర్చుకోవాల్సినవి కొన్ని మిగిలిపోయాయేమో. అందుకే చైనా రాయబారిని ఇంటికి
ఆహ్వానించి మరోసారి ట్యూషన్ చెప్పించుకున్నారు. చైనావల్ల మన దేశానికి యూపీఏ పాలనలో ఏయే రూపాల్లో నష్టం వాటిల్లిందో ఆ గురు గుర్తెరగాలి" అని జైశంకర్ హితవు పలికారు. పాక్‌తో పోరు విరమణలో వేరే దేశం జోక్యం గానీ, వాణిజ్య సంబంధం గానీ లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ మాదిరిగా కాకుండా ఇప్పుడు మన దేశంలో ఉగ్రదాడికి ప్రతిదాడి అదేరోజు ఉంటుందని స్పష్టంచేశారు.



# లార్డ్స్ TO ఓవల్ అదే ఫైర్..
# ఈసారి పిచ్ క్యురేటర్ ద్వంద్వ వైఖరి

%ఐదు టెస్టుల సిరీస్‌లో తొలి రెండు మ్యాచులు జరిగిన తీరు వేరు. ఆ తర్వాత రెండు టెస్టుల్లో 'ప్లేయర్ల' మధ్య నెలకొన్న 'స్లెడ్జింగ్' ఫైట్ వేరు. ఇప్పుడు ఆఖరి టెస్టుకొచ్చేసరికి 'సిబ్బంది' నేరుగా రంగంలోకి దిగినట్లుంది. మ్యాచ్ ఆరంభానికి ముందే అగ్గి రాజేస్తూ 'ఓవల్ పిచ్ క్యురేటర్' వ్యవహరించిన తీరు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఇంగ్లాండ్ - భారత్ జట్ల మధ్య గురువారం నుంచి ఐదో టెస్టు ప్రారంభం కానుంది. ఇప్పటికే 2-1 ఆధిక్యంలో ఉన్న ఆతిథ్య జట్టు సిరీస్‌పై కన్నేయగా.. ఆఖరి టెస్టులో గెలిచి సమం చేయాలని టీమ్‌ఇండియా భావిస్తోంది. లార్డ్స్ మ్యాచ్ నుంచి ఆటగాళ్ల మధ్య మొదలైన లడాయి.. మాంచెస్టర్‌లో ముందస్తు 'డ్రా' వివాదం వరకూ వెళ్లింది. ఇక ఓవల్‌లో ఈసారి మాత్రం పిచ్ క్యురేటర్ ఫోర్టిస్ 'అగ్గి'ని రాజేశాడు. అతడి ద్వంద్వవైఖరే ఇప్పుడు భారత క్రికెట్ అభిమానులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది.

గంభీర్‌తో అలా..

పిచ్‌కు దూరంగా ఉండి చూడాలంటూ భారత కోచింగ్ బృందానికి ఓవల్ మైదానం సిబ్బంది చెప్పారు. ఈ విషయంలో క్యురేటర్ లీ ఫోర్టిస్ - భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. 'మేమేం చేయాలో నువ్వు చెప్పకూడదు. నువ్వు గ్రౌండ్స్‌మెన్‌లో ఒకడివి. అంతకుమించి ఏమీ కాదు" అని గంభీర్ అన్నాడు. తనను దూషించడంపై మ్యాచ్ రిఫరీకి ఫిర్యాదు చేస్తానని ఫోర్టిస్ హెచ్చరించగా.. "నీ ఇష్టమొచ్చింది చేసుకో" అని భారత కోచ్ గట్టిగా బదులిచ్చాడు. ఆ తర్వాత ఎవరికి వారు తమ పనులు చూసుకొనేందుకు చెరో దిక్కుకు వెళ్లిపోయారు. పిచ్ క్యురేటర్ ఇలా ప్రవర్తించిన దాఖలాలను తామెప్పుడూ చూడలేదని భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కూడా అసహనం వ్యక్తం చేశాడు.

మెక్‌కల్లమ్‌తో ఇలా..

ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసేందుకు ప్రధాన కారణం ఇదే. భారత ప్రధాన కోచ్‌తో అలా వ్యవహరించిన ఫోర్టిస్ తమ జట్టు కోచ్‌తో మాత్రం గతంలో విభిన్నంగా ప్రవర్తించాడు. టీమ్‌ఇండియా సిబ్బందిని పిచ్‌కు 2.5 మీటర్ల దూరం నుంచి చూడాలని చెప్పిన అతడు మాత్రం మెక్‌కల్లమ్‌తో కలిసి పిచ్ పైనే సంభాషించడం ఇప్పుడు భారత అభిమానులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. గత యాషెస్ సిరీస్ సందర్భంగా చోటుచేసుకున్న ఆ ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇదేం ద్వంద్వవైఖరి అంటూ తూర్పారపట్టారు. 'మీ కోచ్‌తో అలా మాట్లాడిన నువ్వు.. ప్రత్యర్థి కోచ్‌లకు కనీసం మర్యాద ఇవ్వవా?' అంటూ ప్రశ్నల వర్షం కురిశాయి. మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్ జట్టుపై తీవ్ర విమర్శలు వచ్చినా సరే వారి ప్రవర్తన మారలేదని ఈ ఘటనే రుజువు చేసిందని క్రికెట్ విశ్లేషకులూ వ్యాఖ్యలు చేశారు.

చివరి టెస్టు ఇంకెలా ఉంటుందో?

మాంచెస్టర్‌లో మ్యాచ్‌ను డ్రా చేసుకోవడంతో ఇంగ్లాండ్ ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉంది. గెలవలేకపోవడంతోపాటు తాము ఆఫర్ చేసినప్పుడు భారత్ డ్రా కోసం అంగీకరించలేదనేది వారి బాధ. అక్కడే సిరీస్‌ను కైవసం చేసుకొని టీమ్‌ఇండియాను ఇరకాటంలో పెడతామనుకుంది. కానీ, ఆ ఆశలకు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ బ్రేక్ వేశారు. ఇప్పుడు చివరి మ్యాచ్‌లో విజయం సాధించాలనే కృతనిశ్చయంతో ఉన్న ఇంగ్లాండ్ అప్పుడే 'క్యురేటర్' రూపంలో ఓ అస్త్రాన్ని సంధించింది. ఇక మైదానంలో ఆ జట్టు ప్లేయర్లు తమ 'నోటి'కి కాస్త ఎక్కువగానే పనిజెప్పే అవకాశం లేకపోలేదు. ఇంగ్లాండ్ పర్యటనను భారత్ గెలుపుతో ముగించాలని.. ఆతిథ్య జట్టుకు షాక్ ఇచ్చేలా ప్రదర్శన చేయాలని అభిమానుల ఆకాంక్ష.

# ఐదో టెస్టు.. ఐదు రికార్డులపై కన్నేసిన గిల్



ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటర్‌గా రికార్డుల ప్రభంజనం సృష్టించాడు. తొలిసారి సారథ్యం చేపట్టినా జట్టును నడిపించడంలో మాత్రం ముందున్నాడు. ఇప్పటికే చాలా ఘనతలను తన ఖాతాలో వేసుకున్న గిల్.. ఐదో టెస్టు ముంగిట కూడా చాలా రికార్డులపై కన్నేశాడు. కెప్టెన్‌గా ఓ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా గిల్ నిలిచాడు. అతడు ఇప్పటివరకు 722 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి. తన అత్యధిక వ్యక్తిగత స్కోరు 269 పరుగులు కావడం విశేషం. ఈక్రమంలో అతడి ముందున్న రికార్డులేంటో ఓ లుక్కేద్దాం.

53 పరుగులు: ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు నమోదు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచేందుకు గిల్‌కు అవసరమైన పరుగులు ఇవీ. ప్రస్తుతం సునీల్ గావస్కర్ (774) పేరిట ఈ రికార్డు ఉంది. వెస్టిండీస్‌పై 1971లో 154.80 సగటుతో గావస్కర్ పరుగులు సాధించాడు.

253 పరుగులు: ఒకే సిరీస్‌లో ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్ ఆస్ట్రేలియా దిగ్గజం సర్ డాన్ బ్రాడ్‌మన్. 1930లో యాషెస్ సిరీస్‌లో 974 పరుగులు చేశాడు. ఇప్పుడు భారత్ సారథి గిల్ మరో 253 పరుగులు చేస్తే బ్రాడ్‌మన్‌ను అధిగమించే అవకాశం ఉంది. ఇలా జరగాలంటే భారీ డబుల్ సెంచరీ లేదా రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు చేయాల్సిందే.

89 పరుగులు: భారత్ తరఫున ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన సారథిగా గిల్‌దే రికార్డు. కానీ, ఓవరాల్‌గా మాత్రం సర్ డాన్ బ్రాడ్‌మన్ పేరిట ఉంది. అతడు ఇంగ్లాండ్‌పై 1936-37సీజన్‌లో ఐదు టెస్టుల సిరీస్‌లో 810 పరుగులు చేశాడు. ఇప్పుడు గిల్ మరో 89 రన్స్ చేస్తే అద్భుతమైన ఘనత సాధించినట్లే.

ఒక్క సెంచరీ: ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ 4 శతకాలు చేశాడు. ఒక్క సిరీస్‌లో ఎక్కువ సెంచరీలు చేసిన బ్యాటర్‌గా విండీస్‌కు చెందిన క్లైడ్ వాల్‌కట్ పేరిట రికార్డు ఉంది. అతడు 1955లో ఆస్ట్రేలియాపై ఐదు సెంచరీలు బాదాడు. ఇప్పుడు గిల్ మరొకటి చేస్తే క్లైడ్‌తో సమంగా నిలుస్తాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకాలు బాదితే టాప్‌లోకి దూసుకెళ్తాడు.

ఆ ఇద్దరూ వెనక్కే: శుభ్‌మన్ గిల్ మరో ఒక్క సెంచరీ చేస్తే అత్యధిక శతకాలు బాదిన కెప్టెన్‌గా అవతరిస్తాడు. ఇప్పుడు డాన్ బ్రాడ్‌మన్ (1947లో ఇంగ్లాండ్‌పై), సునీల్ గావస్కర్ (1978లో విండీస్‌పై) నాలుగేసి సెంచరీలు చేశారు. ప్రస్తుతం ఇంగ్లాండ్‌పై నాలుగు సెంచరీలతో ఉన్న గిల్.. 'ఓవల్'లో రికార్డు హోల్డర్‌గా నిలవాలని ఆశిద్దాం.



# భారత్ - పాక్ సెమీస్‌పై నీలినీడలు..
# వైదొలిగిన స్పాన్సర్

ప్రపంచ ఛాంపియన్‌షిప్ లెజెండ్స్ టోర్నీలో మరోసారి భారత్, పాకిస్థాన్ తలపడే సందర్భం ఎదురైంది. ఇప్పటికే లీగ్ స్టేజ్‌లో మ్యాచ్ రద్దైన సంగతి తెలిసిందే. పాక్‌తో ఆడేది లేదని టీమ్‌ఇండియా మాజీలు తేల్చిచెప్పడంతో క్యాన్సిల్ చేస్తూ నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు ఇరుజట్లూ సెమీస్‌కు చేరుకోవడంతో ఏమవుతుందోనని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. జులై 31న బర్మింగ్‌హామ్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. ఈక్రమంలో టోర్నీ స్పాన్సర్ ఈజ్‌మైట్రిప్ కీలక నిర్ణయం తీసుకుంది. తాము ఈ మ్యాచ్ స్పాన్సర్‌షిప్ నుంచి వైదొలుగుతున్నట్లు వ్యవస్థాపకుడు నిశాంత్ పిట్టి సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు.

"ఉగ్రవాదం, క్రికెట్ ఒకదానికొకటి ముడిపడి ఉండవు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ లెజెండ్స్ సెమీస్‌కు చేరుకున్న భారత ఛాంపియన్స్‌కు శుభాకాంక్షలు. దేశం గర్వపడేలా చేశారు. ఇప్పుడు పాకిస్థాన్‌తో సెమీస్‌లో తలపడాల్సి ఉంది. అయితే, ఈసందర్భంగా ఒకటి చెప్పదల్చుకున్నా. మేం ఎప్పుడూ టీమ్‌ఇండియా వెంటే ఉంటాం. ఇరుదేశాల మధ్య పరిస్థితులు సద్దుమణిగేవరకూ మేం ఇలాంటి మ్యాచ్‌లకు స్పాన్సర్ చేయబోం. భారత ప్రజల మనోగతాన్ని మేం విన్నాం. అందుకే, డబ్ల్యూసీఎల్‌లో భారత్ - పాక్ మ్యాచ్ స్పాన్సర్‌షిప్‌గా ఈజ్‌మైట్రిప్ ఉండదు. కొన్ని అంశాలు క్రీడల కంటే ఎక్కువ. ఎప్పుడైనా సరే దేశం ముఖ్యం. ఆ తర్వాతే బిజినెస్. జై హింద్" అని నిశాంత్ వెల్లడించారు.

మరి ఈసారి ఏం చేస్తారో..?

లీగ్ స్టేజ్‌లో పాకిస్థాన్‌తో భారత్ ఆడకపోవడంతో ఆ మ్యాచ్‌ను రద్దు చేసి ఇరుజట్లకూ చెరొక పాయింట్ ఇచ్చారు. ఇప్పుడు నాకౌట్‌లో అదీనూ సెమీస్ కావడంతో మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఇప్పటివరకు భారత మాజీలు ఇంకా స్పందించలేదు. తాజాగా విండీస్‌పై యువరాజ్ సింగ్ నాయకత్వంలోని భారత్ విజయం సాధించడంతో నాలుగో ప్లేస్ దక్కించుకుని సెమీస్‌కు చేరుకుంది. ఇప్పటికే పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా కూడా నాకౌట్ దశకు చేరుకున్నాయి. విండీస్, ఇంగ్లాండ్ టోర్నీ నుంచి నిష్క్రమించాయి. సెమీస్‌లో భారత్ ఆడకూడదని నిర్ణయం తీసుకుంటే మాత్రం పాక్ ఫైనల్‌కు చేరుతుంది.

# భారత్‌పై అతడొక్కడే ఎఫెక్టివ్.. ఆర్చర్ - వోక్స్‌కు అంత సీన్ లేదు: బంగర్



ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టు కోసం టీమ్‌ఇండియా సమాయత్తమవుతోంది. గురువారం నుంచి లండన్‌లోని ఓవల్ వేదికగా ఇరు జట్ల మధ్య చివరి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే 2-1 ఆధిక్యంలో ఇంగ్లాండ్ ఉండగా.. భారత్ సిరీస్‌ను సమం చేయాలని చూస్తోంది. ఇలాంటి సమయంలో ఆతిథ్య జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ గాయంతోనే బౌలింగ్ చేస్తాడా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ అతడు బౌలింగ్ చేసేందుకు ఇబ్బందిపడి ఆగితే మాత్రం.. గెలిచేందుకు టీమ్‌ఇండియాకు అంతకుమించిన అవకాశం మరొకటి లేదని మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ వ్యాఖ్యానించాడు. మిగతా బౌలర్లతో భారత్‌కు ఇబ్బందేమీ లేదని, స్టోక్స్ మాత్రమే చాలా ప్రభావంగా కనిపించాడని విశ్లేషించాడు.

"ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా బెన్‌స్టోక్స్ కొనసాగుతున్నాడు. భుజం గాయంతో ఇబ్బందిపడుతున్న అతడు ఐదో టెస్టులో బౌలింగ్ చేయకపోతే అంతకుమించిన సంతోషకరమైన వార్త మరొకటి ఉండదు. గత టెస్టులో కొన్ని ఓవర్లు మాత్రమే అతడు విసిరాడు. అంతకుముందు లార్డ్స్‌లో తన జట్టును గెలిపించాడు. అతడు ఎక్కువగా బౌలింగ్‌కు రాకుండా ఉంటే ఇతర బౌలర్లతో భారత బ్యాటర్లు ఇబ్బందేమీ పడరు. జోఫ్రా ఆర్చర్, క్రిస్ వోక్స్ ఉన్నా సరే వారి ఎఫెక్ట్ ఏమీ లేదు. జోఫ్రా కేవలం ఎడమచేతివాటం బ్యాటర్లకు ప్రమాదకరంగా కనిపించినా.. కుడిచేతి వాటం బ్యాటర్లు వచ్చేసరికి ఇబ్బంది పడ్డాడు. వోక్స్‌ను కూడా మన బ్యాటర్లు బాగానే ఎదుర్కొన్నారు. స్వింగ్ కూడా అప్పుడప్పుడు తప్పితే పెద్ద ఎఫెక్ట్ చూపించలేదు. కార్స్ కూడా వరుసగా నాలుగు మ్యాచులు ఆడాడు. అందుకే, బెన్ స్టోక్స్‌ను కాచుకుని నిలబడితే భారీగా పరుగులు చేసే అవకాశం ఉంది. ఇంగ్లిష్ బ్యాటర్లపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు వీలుంది" అని బంగర్ వ్యాఖ్యానించాడు.

"బ్యాటింగ్ డెప్త్ కోసం తుది జట్టులోకి కుల్‌దీప్ యాదవ్‌ను తీసుకోవడం లేదని చెబుతున్నారు. అయితే, వీరు (మేనేజ్‌మెంట్) అవకాశం కల్పించిన శార్దూల్ ఠాకూర్ కంటే ఎక్కువ వికెట్లు కుల్‌దీప్ తీశాడు. అలాగే నంబర్ 8లోనూ బ్యాటింగ్ చేయగలడు. ఓవల్‌లో మూడు లేదా నాలుగో రోజు నుంచి పిచ్ మారిపోతుంది. కచ్చితంగా రిస్ట్ స్పిన్నర్ కీలక పాత్ర పోషిస్తాడు.

# చివరి టెస్టులో అర్ష్‌దీప్

ఓవల్: భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఇంగ్లాండ్‌తో ఓవల్‌లో గురువారం ఆరంభమయ్యే చివరిదైన అయిదో టెస్టులో అరంగేట్రం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నాలుగో టెస్టులో అర్ష్‌దీప్‌ను ఆడిస్తారనే వార్తలు వచ్చినా.. చేతి గాయం కారణంగా అతడిని తుది జట్టు ఎంపికకు పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో గురువారం మొదలయ్యే అయిదో టెస్టులో ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఆడటం దాదాపు ఖాయమే. గాయం నుంచి కోలుకున్న అర్ష్‌దీప్.. మంగళవారం ఐచ్ఛిక నెట్ సెషన్లో ఎక్కువసేపే బౌలింగ్ సాధన చేశాడు. అర్ష్‌దీప్ అరంగేట్రం చేస్తే జట్టులో మరోసారి మార్పులు చేర్పులు తప్పవు. నాలుగో టెస్టులో బుమ్రా, సిరాజ్, అన్షుల్ కాంబోజ్ పేస్ బౌలింగ్ బాధ్యతలు పంచుకున్నారు. పని భార నిర్వహణలో భాగంగా చివరి టెస్టుకు బుమ్రా దూరమవుతాడా.. లేక ఆడతాడా అన్నదానిపై స్పష్టత లేదు. నాలుగో టెస్టులో విఫలమైన అన్షుల్ కాంబోజ్, శార్దూల్ ఠాకూర్‌లపై కూడా వేటు పడడం లాంఛనమే. అప్పుడు సిరాజ్‌కు తోడు ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ బౌలింగ్ భారాన్ని పంచుకునే ఛాన్స్ ఉంది. గాయంతో ఆకాశ్ దీప్ కూడా నాలుగో టెస్టులో ఆడలేదు. అతను ప్రస్తుతం కోలుకున్నాడు. చివరి టెస్టుకు అందుబాటులో ఉంటాడు. అర్ష్‌దీప్ ఇప్పటిదాకా 63 టీ20లు, 9 వన్డేలు ఆడాడు. 2024 టీ20 ప్రపంచకప్ విజయంలోనూ అతడు కీలకపాత్ర పోషించాడు.

